చుట్టాల తాకిడి
ఇంటిని గుల్లచేస్తుంటే
అతను
ఎలా బయటపడ్డాడు?

# పాపంసుబ్బారావు

కె.విజయలక్ష్మి
కథ

"హొహిహిహి! తగలడండి రాబంధు బాబాయ్! మునిసిపాలిటీ వాళ్ల చెత్త బండిలా అడుగడుగునా ఆగుతూ అందర్నీ అడుక్కుంటూ రాకపోతే ఓ టెలిగ్రాం ఇచ్చి ఛస్తే స్టేషన్‌కి వచ్చే వాడినిగా మిమ్మల్ని ఆటోలో వేసుకు పోటానికి".

ఈ ముసలిపీనుగు ఇంటికి తాళం పెట్టే అవకాశం లేకుండా బకాసురుడిలా హఠాత్తుగా వూడిపడ్డాడే! తిట్టుకుంటూ ఆటోలో సామాను దించుతున్నాడు సుబ్బారావు.

"ముందుచూపుతో అలా చెయ్యలేదులే! విజయవాడలో తాటికాయంత తాళం ఎదురయింది మరి".

"ముందు చూపా నీ బొందమాపా! వాళ్ల అదృష్టం! నా దురదృష్టం" పళ్లు పటపటా నూరేడు.

"ఇంకా గుమ్మడి కాయలా అక్కడే నిలబడిపోయావే రండి పిన్నీ!" వెవుల్దాక నవ్వుతూ ఆహ్వానించాడు సుబ్బారావు.

"అదేవిటి నాయనా! అలా అసహ్యంగా నవ్వుతున్నావు" వికారంగా మొహంపెట్టి అడిగింది రాజమ్మ.

"మీ లాంటి జిడ్డు చుట్టాలొచ్చినప్పుడు ఆనందం పట్టలేక అలా నవ్వుతారులే అత్తయ్యా" అప్పుడే వచ్చిన సుందరి చెప్పింది.

"ఆటోకి పాతిక రూపాయలివ్వు సుబ్బారావు" ఇంట్లోకి అడుగేస్తూ చెప్పాడు రాజారావు.

ఇవ్వక ఛస్తానా! మిర్రిమిర్రి చూసాడు. పీపాల్లా వూరంతా వూరేగి పాతిక ఇస్తారా? నలభై ఇమ్మని పేచీ పెట్టాడు



ఆటో డ్రైవర్.

కిమ్మనకుండా ఇచ్చాడు సుబ్బారావు.

వంట ప్రయత్నం చెయ్యబోతున్న సుందరితో... చూడమ్మాయ్! భోజనవేళ ఏడూ దాటిపోయింది...

సుందరి హమ్మయ్య! అని ఊపిరి పీల్చుకొనేలోపే—

అందుకుంది... ''ఓ కిలో గోధుమ

రవ్వతో అల్లం, పచ్చిమిర్చి దండిగావేసి నాలుగు రెబ్బల కరివేపాకు చేర్చి... నేతి తాలింపుతో ఘుమఘుమలాడే వుప్మా చెయ్యవే అమ్మా'' ఆర్డర్ వేసింది రాజమ్మ.

''ఆ చేత్తోనే ఓ రెండు గుప్పెళ్ల జీడిపప్పు కూడ తగిలించమ్మా'' హాల్లో నుండి పొలికేక వేశాడు రాజారావు.

''మీరు తిండి తిని ఎన్నాళ్లయిందత్తయ్యా''

కిసుక్కున నవ్వింది రాజమ్మ. ''రాత్రంతా తిన్నామా. పొద్దుటేమో ఓ డజన్ సాంబారు ఇడ్లీ మాత్రమే తిని బయల్దేరాము'' అంది.

ఉప్మా తయారు చేసే ప్రయత్నంలో మునిగింది సుందరి.

రాజారావు వరసకి మేనమామ అవుతాడు సుందరికి. చుట్టాలిళ్లకు వెళ్లి నెల తరబడీ తిష్టవేస్తుంటాడు భార్యతో సహా. గంతకు తగ్గ బొంత రాజమ్మ. రాబందు రాజారావుగా చాలా పేరుంది బంధువర్గంలో.

వాళ్లు వస్తున్నట్టు ఉత్తరం రాసినా, టెలిగ్రాం ఇచ్చినా క్షణాల్లో మాయమవుతున్నారు గృహస్థులు ఇంటికి తాళం పెట్టి.

''టిఫెన్‌లో అల్లం బాగా వెయ్యి... పాయసంలో జీడిపప్పు, కిస్‌మిస్ జాస్తిగా వెయ్యి తల్లీ... పనసపొట్టు ఆవ పెట్టి వండితే ఆ రుచే వేరు... ఏవిటో ఈ మధ్య జిహ్వ చవిచచ్చింది... మానెడు పప్పులో పెరుగు గారెలు వెయ్యమ్మ ఇక్కడ పాలు, పెరుక్కి కొదవలేదుగా...''

ఇక్కడ మీ బాబుగాడు తోలిన బ్రతెలున్నాయి రుసరుసలాడేది సుందరి. ఆ గొంతెమ్మ కోరికల లిస్ట్ విని.

ఇలా రోజూ అడిగి మరీ పెళ్లి విందు ఆరగించేవారు. వీళ్లతోడు ఇద్దరు మనవళ్లు. వాళ్లు పిల్లలు కాదు పిడుగులు... పిల్ల రాక్షసులు. టిఫెన్‌ని చద్దన్నం తిన్నట్టు కంచంపుడు గుటుక్కున లాగించేవాళ్లు. గంట తిరక్కుండానే ఆకలాకలంటూ అంగలారుస్తూ అన్నానికి ఎగబడేవాళ్లు.

టేప్ రికార్డర్‌లో పార్ట్‌లన్నీ వాళ్ల ఆట వస్తువులుగా మారాయి. రేడియో మూలన పడింది. టీవీ రిపేర్ షాపుకెళ్లింది. టైంపీస్ పాత ఇనుప సామానులో చేరిపోయింది. డబుల్ కాట్ వాళ్ల కొక్కిరాయి ఆటలకి... కోతి గెంతులకి వేదిక అయ్యింది.

వంటికి కారం రాసుకున్నట్టు సుబ్బారావు వొళ్లు భగభగ మండిపోతోంది.

తమకోసం తెచ్చుకున్న నెల సరుకులు పదిరోజులకే ఉఫ్‌మని ఊదేశారు. సంక్రాంతి పండక్కి సుందరికి పట్టుచీర కొనాలని పెట్టిన ఫెస్టివల్ అడ్వాన్స్ రెండు వేలకి గాల్లోచ్చాయి. సినిమాలకి... షికార్లకి అక్కడ తినే నానా అడ్డమైన గడ్డికి... ఇంకా ఎగ్జిబిషన్ అనీ... గుళ్లు గోపురాలు అని నా పిండా కూడు అని నా కొంప గుల్ల చేశార్రా దేవుడోయ్. జేర్ మన్నాడు.

ఆ ముసలి పీనుగుల పుణ్యమా అని 'ఆ' సుఖం కూడా కరువైంది. ఆహా.. మంచాలు.. పరుపులు ఎంత బావున్నాయి అంటూ మనవళ్ల నిద్దరిని వేసుకొని తమ భారీ కాయాలని వాటిమీదకి చేర్చేవారు.

ఏదో సందు చూసుకొని ఆ కోరిక

ప్పుకుందామంటే పగలంతా నడ్డి విరిగేలా వంటపని ఇంటి పనితో అలసిపోయిన సుందరి మంచం మీదకి చేరగానే కుంభకర్ణుడిలా గుర్రుకొట్టి నిద్రపోయేది. ఆ కారణం వల్ల కూడా ఇరిటేట్ అవుతున్నాడు సుబ్బారావు.

బకాసురుడి వారసులబారి నుండి ఎలా తప్పించుకోవాలా అని కిచెన్‌లో చేరి సుందరీ, సుబ్బారావులిద్దరూ జుత్తు పీక్కుంటూ తలయి పగలగొట్టుకుంటున్నారు.

"ఏవిటే సుందూ! అబ్బాయి బట్టలంటున్నాడు!" కిచెన్‌లోకొచ్చింది రాజమ్మ.

వులిక్కిపడ్డారిద్దరూ!

బట్టలు కాదు నా శ్రాద్ధం.... నా పిండాకూడు... కసిగా అన్నాడు సుబ్బారావు

సుందరి బట్టల విషయం కాదులే అనేలోపే రాజమ్మ కొనసాగించింది. ఎప్పుడో ఏడాది క్రితం మీ పెళ్లిలో చూడ్డం. వెళ్లాళ్లంటాములే....


"ఎందుకూ.... మేం తిరుపతి కెళ్లకుండానే నిలువు దోపిడీ చేయబడటానికా?" కస్సుమన్నాడు సుబ్బారావ్.

"బట్టల కప్పుడే ఏం తొందర. ఇలాంటివన్నీ మీ బాబాయిగారికి ఇష్టం వుండవు నాయనా! అయినా మీరెంతో అభిమానంతో బట్టలు పెడతానంటే కాదనటం ఏం బావుంటుంది. పెట్టేవాళ్లు వద్దన్నా మానేస్తారా ఏవిటి? సాగదీసింది.

సుబ్బారావ్ వంటింటి గోడకేసి తలని దబదబా బాదుకున్నాడు.

సుందరి గుడ్లు తేలేసి పిచ్చెక్కిన దానిలా ఆదోరకం వెర్రి చూపు చూడ్డం మొదలెట్టింది.

రాజమ్మ కోరికల లిస్ట్ చదవటం మొదలెట్టింది. "అన్ని రంగులు కట్టేనవే. దమయంతి పచ్చమీద ఎప్పటినుండో మహామోజుగా వుందే సుందూ! దోసెడు వెండి జరీ అంచున్న వెంకటగిరి చీర నాకు తీసుకో. ఇప్పుడు మ్యాచింగ్ జాకెట్ ఎప్పరూ



వేయటం లేదుకదా! ఏదో ఒకటి నీకు నచ్చింది పట్టా. మీ మావయ్యేమో పెద్దాపురం సిల్కంటే భలే మక్కువ. రెండు జతలు తీస్కోండి. అవి చూసి ఎంత మురిసిపోతారో.... ఇహపోతే పిల్లలకి రెడీమేడ్ బట్టలే తెస్తారనుకో'' నాన్ స్టాప్‌గా చెప్పింది.

''బట్టలంపితే కొన్నాళ్లకే చిరిగిపోతయ్. వాతలేస్తే జీవితాంతం వుండిపోతాయ్'' తేరుకున్న సుబ్బారావ్ పళ్లు పటపట లాడించాడు.

''సుందూ! వాతలంటావేంటి పైత్యం ప్రకోపించిందో ఏంటో! అల్లం రసం తీసివ్వు రోగం కుదురుతుంది'' తెలివిగా... లౌక్యంగా బట్టలు పెట్టమని ఇండైరెక్ట్‌గా తన కోరికని... ఇష్టాన్ని బైటపెట్టే వల్లగా జారుకుంది అక్కడ నుంచి.

ఓ రోజు మధ్యాహ్నం హడావిడిగా వచ్చాడు సుబ్బారావ్. ''సుందరీ... సుందరీ సూట్‌కేస్‌లో బట్టలు సర్దు'' తొందర చేశాడు.

''ఎక్కడికండి? అయోమయంగా అడిగింది.''

''సాక్షాత్తు మా తాతగారి అమ్మమ్మ పోయిందిట టెలిగ్రాం వచ్చింది'' బావురుమన్నాడు. ఆ మాటవిని గల్లుమంది సుందరి

రాబందు బాబాయి మీరు కూడా బయలుదేరండి! రాజారావు చూడకుండా సుందరికి కన్ను గీటాడు.

''హఠాత్తుగా ప్రయాణం ఎలానోయ్. మీరు వచ్చే వరకు వుంటావులే. నువ్వు అనవసరంగా హైరానాపడకు'' నోటికి ఉల్లిపాయ పకోడి అందిస్తూ లాపిగా చెప్పాడు.

గుండెల్లో రాయి పడింది. ఐనా మరో ప్రయత్నం చేశాడు.

''పెద్ద కర్మ అయ్యే వరకు అక్కడే వుంటాము''.

మరేం ఫర్లేదు! మీరు నిశ్చింతగా వెళ్లరండి. అసలే రోజులు బావుండలేదు. ఇంటికి తాళం పెట్టటం అంత మంచిది కాదు.

''దొంగలుపడి దోచుకు పోయినా మాకు ఇంత బాధ వుండకపోను'' బాధగా అన్నాడు .

''ఆదిదంపతుల్లా మేము ఇంట్లో వుండే ఏ దొంగ వెధవా ఈ ఛాయలకే రాడు'' మొగుడికి వత్తాసు పలికింది రాజమ్మ.

''మీరు ఆది దంపతులా? కాదుకాదు నా పాలిట శనిగ్రహాలు, దోపిడి దొంగలు'' బాధలో గింజుకున్నాడు.

''ఏమండీ! ఇంట్లో సరుకులన్నీ నిండుకున్నాయ్'' గొప్ప ఆనందపడిపోతూ రహస్యంగా చెప్పింది సుందరి.

''ఆహా ఎంత శుభవార్త చెప్పావు సుందూ. దెబ్బలో వీళ్ల పరార్. సాయంత్రానికి తిండిలేక పోతే స్టేషన్ ఎక్కడుందో వెతుక్కుంటూ పోరూ. శని విరగడవుతుంది''.

''బాబాయ్ మాకిచ్చిన మాట కోసం గబ్బిలంలా ఇల్లు పట్టుకొని వేలాడకండి. మీకు ఇబ్బందిగా అనిపిస్తేత రేప్పొద్దుట వెళ్లండి. కీస్ ప్రక్కింటి వాళ్లకిచ్చి వెళ్లండి'' రిక్షా ఎక్కుతూ చెప్పాడు.

పదిరోజులు పదిక్షణాల్లా గడిచాయి.

హోటల్ ఏసి రూంలో అమరసుఖాలు అనుభవించాడు. ఆకలిగొన్నవాడికి పంచభక్ష్యాలు దొరికినట్టు అందాన్ని ఆస్వాదించాడు. నెళ్ళ్ల కరువు తీర్చుకున్నాడు..

నెల్లళ్ళ లంఖణాలు చేసిన దానిలా నీరసించిపోయింది సుందరి. అయినా మొహంలో ఎంతో ఆనందం... తృప్తి.

మరో రెండు రోజులు ఆనందంగా గడిపి ఇంటికి బయలుదేరారు.

రిక్షా దిగుతూనే ఇంటిని చూసి ఆశ్చర్యపోయారు. తాటికాయంత తాళం దర్శనమిస్తుందనుకున్న వారి కలల్ని కల్లలు చేస్తూ... ఆశల్ని అడియాశలు చేస్తూ సాదరంగా ఆహ్వానిస్తున్న రాజారావు దంపతులను చూస్తూనే మూర్ఛ వచ్చినంత పనయ్యింది ఇద్దరికీ.

'తిండిలేక ఆకలితో నకనకలాడే కడుపు మాడి పుడాయిస్తారనుకుంటే! ఇదేవిటి? గాదికింద పందికొక్కుల్లా బలిసి బాగా కొవ్వు పట్టి వున్నారే''.

తనింటిలోకి తనే ఆహ్వానింపబడుతోంటే ఏడుపు ముంచుకొచ్చి భోరున ఏడ్చాడు సుబ్బారావు.

"వీధిలో వాళ్లంతా మంచి మన్నన తెలిసిన పెద్ద మనుషులు. నువ్వంటే ఎంత గౌరవం... ఎంత మర్యాద'' మురిసిపోతూ సుబ్బారావుతో చెప్పింది రాజమ్మ.

సుబ్బారావు చొక్కా ఎత్తి కళ్ళు తుడుచుకుని "ది గ్రేట్ సుబ్బారావంటే ఏమనుకున్నారు'' గర్వంతో ఛాతీ పొంగిస్తూ కాలర్ ఎగరేశాడు.

ఇంట్లో సరుకులన్నీ నిండుకున్నాయి. మీరొచ్చే వరకు వుంటామని మాటిచ్చాముగా... వెళ్లిపోతే బావుండదని.

"మీ దిక్కుమాలిన మాట పాడుగాను. మీ ఇష్టం వచ్చినపుడు వెళ్లమని చెప్పాను కదా'' మామూలయిపోతూ అన్నాడు.

మళ్లీ తనే "సరుకులు నిండుకున్నాయి అన్నారుగా మరి ఇన్నాళ్లు ఏం తిన్నారు? అదేదో సినిమాలోలా దిళ్లూ, పరుపులు

## లోన్



'బ్యాంకులో లోన్ తీసుకున్న రెండు లక్షల్తో ఏం చేశావ్!' అడిగాడు అప్పారావ్;

'ఓ పంది కొన్నాను!'

'ఇంకా'

'ఓ గాడిద కొన్నాను!'

'తరువాత!'

'ఓ దున్నపోతుని కొన్నాను!'

'ఊ... ఇంకా!'

'ఓ అల్లుడ్ని కొన్నాను!' కసిగా చెప్పాడు కొండల్రావ్.

– గొంటు శ్రీనివాస (కిడిమి)

పీక్కుతినలేదుగా? గాబరాగా బెడ్‌రూంలోకి పరుగెత్తి వాటిని పరికించి చూశాడు.

"అబ్బే అలాంటిదేమీ జరగలేదు నాయనా" దీర్ఘం తీసింది.

"ప్రక్కింటి ఆండాళ్ దగ్గర రెండు మానికల బియ్యం ఎదురింటి వెంకాయమ్మ దగ్గర శేరు కందిపప్పు... వెనకింటి వనజ ఇచ్చిన తేజ్ పంచదార.. మేడమీది రీటాని బలిమాలగా ఇచ్చిన పావుకిలో కాఫీ గుండతో అతి కష్టంమీద రెండు రోజులు గడిపాం".

"అంత కష్టం దేనికి పెరట్లో పాడుపడ్డ బావి వుంది కదా" వళ్లు మండి అంది సుందరి.

'ఇంతలో...' కొనసాగించింది రాజమ్మ.

'ఆ ఇంతలో ఏం జరిగిందో తొందరగా చెప్పి చావండి' సుబ్బారావుకి ఆ ఇల్లు అందులోని మనుషులు ఎంచక్కా గిరగిరా తిరుగుతున్నట్టుంది. అతనిలో టెన్షన్ పెరిగి పోతోంది.

'ఇంతలో... ఎదురింటి పుణ్యాత్ముడు పుణ్యం కట్టుకున్నాడు'

"మేం వచ్చే వరకు వాళ్లింట్లో తమని మెయ్యమన్నాడా?" చిరాకుపడ్డాడు.

"ఛ...ఛ అలసు తినమంటే మటుకు సిగ్గువిడిచి తగుదునమ్మా అంటూ అతనింట్లో తింటామా?"

మీ సరుకుల ఖాతా కొట్టు చూపించాడు . మీ బాబాయ్ వెళ్లి ఇంచక్కా రిక్షా నిండుగా సరుకులు తెచ్చారు" చెప్పుల్దాకా నవ్వింది.

"మీ అందరికీ శ్రాద్ధం పెట్టుకోటానికా?" కయ్యుమంది సుందరి.

అదేవిటే సుందూ! అలా అంటావు. బొబ్బట్లు... నువ్వు పూర్ణాలు... చక్కెర పొంగలి..., పులిహోర... పూతరేకులు... నేతి గారెలు... మినప సున్నివుండలు... జంతికలు ఓహ్! ఒకటేమిటి మీ మావయ్య కోరినవన్నీ వండిపెట్టాను.

పీకల్దాక తిని కూచుని ఆయాసపడుతున్న రాజారావు బ్రేవ్‌మని త్రేన్చాడు. పుండు మీద కారం రాసినట్టయింది సుందరికి.

మీవి కడుపాచెరువా? పాటిమీది గంగానమ్మకి కూటిమీదేధ్యాసట. నా కొంపని గుల్ల చేశారు.

"వరదలొచ్చి కొట్టుకుపోయినా— తుఫానొచ్చి ఊడ్చుకుపోయినా— యుద్ధాలొచ్చి సర్వం కోల్పోయినా తొందర్లో కోలుకోగలం కానీ మీలాంటి రాబందులు బంధువులమంటూ వచ్చి పీక్కు తింటే మాలాంటి మధ్య తరగతి వాళ్లు ఎన్నటికీ తేరుకోరు 'తక్షణం కదలండి'".

రెండునెల్లుగా ఉగ్గబట్టుకున్న అక్కసంతా వెళ్లబోసుకుని ఖరాఖండిగా చెప్పింది వెళ్లమని.

"ఏంటో ఈ కాలపు పిల్లలకి మంచి మర్యాద అస్సలు తెలీదు. బంధువుల పొడే గిట్టదు. ఇలా నారాయణమ్మల్లా రాకపోకలు లేకుండా బతికేస్తారు. ఏదో మేనకోడలు కదా చూసిపోదామని అభిమానంతో వచ్చాము" దీర్ఘాలు తీస్తూ పచారీ కొట్టు వాడిచ్చిన చీటీ బొడ్లోంచి తీసి చేతిలో పెట్టింది.

చీటిలోకి చూస్తూ 'హా.. రెండు వేలే' వున్నవాడు వున్నట్టు విరుచుకుపడ్డాడు సుబ్బారావు.

*